మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్

### సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఈనెల 8న జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుండడంతో పరీక్ష కేంద్రాల వద్ద సిఆర్‌పిసి 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని సీపీ డాక్టర్ అనురాధ గురువారం తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణ కోసం గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 8న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. పరీక్ష నిర్వహణ సమయంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాని సూచించారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 2 ట్రాక్టర్ల సీజ్



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న దృశ్యం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను గురువారం పట్టుకొని సీజ్ చేసినట్లు మండల తహశీల్దార్ కృష్ణ గురువారం తెలిపారు. అలాగే సుమారు 8 ట్రాక్టర్ల ఇసుకను డంపు చేయగా డంపు చేసిన ఇసుకను సైతం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హల్దీ వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తాహశీల్దార్ కృష్ణ హెచ్చరించారు. తహశీల్దార్ వెంట రెవెన్యూ ఇన్‌పెక్టర్ నర్సింగ్ యాదవ్, పోలీసులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

## నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**

ఈనెల 10వ తేదీన జిల్లాలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖతోపాటు సంబంధిత శాఖలన్నీ సమిష్టిగా విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం ఐసీసీ లోని మినీ సమావేశ మందిరంలో ఈ నెల 10 తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం 2025పై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ వంద శాతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 4,05,207 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. వలసదారుల, అనాథపిల్లలు ఉన్న ప్రాంతాలు, శిబిరాలు, తక్కువ పారిశుధ్య పరిస్థితుల్లో జీవించే సమూహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మండల, మున్సిపల్ స్థాయిలలో అధికారులు కోఆర్డినేషన్ సమావేశాలు ఏర్పాటు చేసుకోని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గాయత్రీ, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిపిఓ సాయి బాబా, బిసి సంక్షేమాధికారి జగదీశ్, డీఈఓ వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ ఎన్‌జిఓల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 'పది' ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

### -జిల్లా విద్యాధికారి రాధాకిషన్



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**వెల్దుర్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, విద్యార్థులు చక్కగా చదువుకొని వారి ప్రతిభను చాటాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుకునూరు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షల గురించి భయపడకుండా కష్టపడి ఇష్టంతో చదవాలన్నారు. పరీక్షలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్నా ఉపాధ్యాయులకు విన్నవించాలని, తద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి పరీక్షలకు హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పలు అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

**మర్కుక్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి అర్థం లక్ష్మణ్ కుమారుడి వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి హరీష్‌రావును గురువారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి అందజేశారు. వివాహానికి తప్పకుండా హాజరవుతానని హరీష్‌రావు తెలిపినట్లు అర్థం లక్ష్మణ్ పేర్కొన్నారు. హరీష్‌రావును కలిసిన వారిలో మాజీ ఎంపిపి పాండుగౌడ్, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌గుప్త ఉన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### -ప్రిన్సిపాల్ దాసి రాజేందర్

**వర్గల్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):** వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశానికై నిర్వహించే ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికై నిర్వహింపబడే ఈ ఎంపిక పరీక్ష ఈనెల 8వ తేదీ శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. 11వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 11.15 గంటల నుంచి 1.45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 6 కేంద్రాలు, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 4 కేంద్రాలను మొత్తం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలన్నీ గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌తో పాటు నవోదయ విద్యాలయం వర్గల్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 1621 మంది, 9వ తరగతి పరీక్షకు 989 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్‌లు మరియు కేంద్ర పరిశీలకుల శిక్షణ కార్యమము గురువారం వర్గల్ నవోదయలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రవేశ పరీక్ష ఇంచార్జ్ ఎం.శ్రీనివాసరావు, లైబ్రేరియన్ మరియు విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రమేష్ అంచూరి తదితరులు పాల్గొన్నారు.




వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం




కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, హాజరైన అధికారులు

## పార్కింగ్‌కు శాశ్వత ఏర్పాట్లు చేయాలి

### -కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానిమాత ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి వాహనాలపై వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ నియంత్రణకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏడుపాయల దేవాలయం పార్కింగ్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం, మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించే జాతర విషయాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఏడుపాయల ఆలయానికి ఆదివారం ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివస్తున్నా రని, భక్తుల వాహనాల పార్కింగ్ కోసం భక్తులు పడరాని పాట్లు పడుతున్నారని జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే కార్యక్రమాలు, ఏర్పాట్లపై శాఖల వారిగా నిర్వహించే కార్యక్రమాలపై సమగ్ర కార్యచరణ తయారు చేసి సోమవారం వరకు నివేదిక అందచేస్తే ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్‌ఓ భుజంగరావు, ఆర్‌డిఓ రామాదేవి, నర్సాపూర్ ఆర్‌డిఓ మహిపాల్‌రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ఎరువుల స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కొల్చారంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువుల స్టాక్, రోజువారి అమ్మకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్చారంలోని పశు వైద్యశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. మూగజీవాలు రోగాల బారిన పడకుండా మెరుగైన చికిత్సలు అందించాలని వెటర్నరీ డాక్టర్ వీరేశంకు సూచించారు. అనంతరం వసురాం తండాలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, మొగి పురుగు గుర్తించి సస్యరక్షణ చర్యల చేపట్టాలని సూచించారు. క్రిమిసంహారక మందులు ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారని రైతులను అడిగారు.

అనంతరం యాప్‌లో ప్యాడీ బుకింగ్ పరిశీలించి, రైతులతో యాప్ డిజిటల్ సర్వేకు సంబంధించిన లోపాలపై ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం సొసైటీ చైర్మన్ నాగూరి మనోహర్, మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, వెటర్నరీ అసిస్టెంట్ ఆకుల గట్టయ్య, మైపాల్, సీఈవో పార్థిగారి కృష్ణ, బిట్ల నర్సింలు, వినోద్ నాయక్, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఎన్నో ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

- -శరవేగంగా ఉసికె బావి కల్వర్టు పనులు
- -మార్చి నెలలో ప్రజలకు అందుబాటులోకి
- -30 కాలనీ ప్రజలకు ప్రయాణం సులభం
- -హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీల వాసులు



శరవేగంగా సాగుతున్న ఉసికె బావి కల్వర్టు పనులు

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**

ఎన్నో ఏళ్ల నుంచి ఆయా కాలనీల వాసులు, ప్రయాణికులు అటు వైపుగా వెళ్లడానికి అష్టకష్టాలు పడేవారు. కల్వర్టు మీదుగా వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. వర్షాకాలం వస్తే చాలు ఆ కల్వర్టుపై నీరు నిలిచి ఆయా కాలనీలకు వెళ్లే రాకపోకలు బంద్ అయ్యే పరిస్థితి ఉండేది. గతంలోనూ ఈ కల్వర్టుపై నుంచి వెళ్లిన ఓ కారు నీటి ప్రవహానికి కొట్టుకుపోయి కారులో ప్రయాణించిన వారు మృత్యువాత పడ్డారు. ఇన్నేళ్లు కల్వర్టుపై ప్రయాణించలేక పడిన కష్టం మరికొద్ది రోజుల్లో తీరనుంది. కల్వర్టు నిర్మాణం పనులుచకచకా జరుగుతుండడంతో సుమారు 30 కాలనీల ప్రజల కష్టం త్వరలో తీరనుంది. పటాన్ చెరు నియోజకవర్గంలోని బీరంగూడ, రామచంద్రాపురం అనుసంధానం చేసే ఉసికె బావి కల్వర్టు మార్చిలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ, రామచంద్రాపురం వాసులకు అందుబాటులోకి రానుంది. రెండుకోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వంతెన పనులు పూర్తయితే వందనపూరి కాలనీ, ఇసుక బావి, మల్లారెడ్డి కాలనీ, గ్రీన్ ఫీల్ కాలనీలతో పాటు 30 కాలనీల ప్రజలకు రవాణా సౌకర్యం సులభం అవుతుంది. నవంబర్ నెలలో పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. కల్వర్టుకు అనుసంధానమైన రోడ్లను పూర్తి చేయడం జరుగుతుందని, దాదాపు 30 కాలనీల ప్రజలకు రవాణా మార్గం సులభం అవుతుందని, మార్చి నెలలో ఉసికె బావి కల్వర్టు ప్రజలకు అందుబాటులో వస్తుందని అధికారులు తెలిపారు. కల్వర్టు త్వరలో అందుబాటులోకి వస్తుండడంతో ఆయా కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మార్చిలో అందుబాటులోకి.. ఏఈ**

మార్చి నెలలో ఉసికె బావి కల్వర్టు పూర్తవుతుంది. దాదాపు 30 కాలనీల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రజలకు రవాణా సౌకర్యం సులభంగా ఉంటుంది.

## డంప్‌యార్డ్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 6ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం పేరానగర్ గ్రామాన్ని మరో లగచర్లగా మార్చవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె మాట్లాడుతూ పేరానగర్ గ్రామ పరిధిలోని 150 ఎకరాలలో జిహెచ్ఎంసి ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వల్ల పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టి ప్రకృతిని ధ్వంసం చేయడమేనని ఆరోపించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మాత్రం వందలాది మంది పోలీసులతో, భయభ్రాంతులకు గురిచేసి పనులు చేపట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే, భవిష్యత్తు కార్యచరణ రూపొందించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా డంప్ యార్డ్ పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. స్థానిక ప్రజలు ఆ భూమిలో వ్యవసాయం సాగు చేస్తూ పంటలు కూరగాయలు పండిస్తున్నారని గుర్తుచేశారు. డంపు యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రైతులకు పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

సమావేశంలో సిడిసి మాజీ చైర్మన్ సాల బుచ్చిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, టిఆర్ఎస్ గుమ్మడిదల మండలం నాయకులు పాల్గొన్నారు.

అంతకుముందు గుమ్మడిదల మండలం పారానగర్‌లో డంపు యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు సంగారెడ్డి కలెక్టరేట్లో డిఆర్ఓను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ముంపు గ్రామంగా చెలకలపల్లిని గుర్తించాలి

### పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ప్యాకేజీ అందించాలి

### ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

చిన్నకోడూరు మండల పరిధిలోని చెలకపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి ప్రత్యేక పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్యాకేజీ ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గురువారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. చెలకలపల్లి గ్రామ పరిధిలో చుట్టూ కాళేశ్వరంలో భాగంగా అన్నపూర్ణ(అంతగిరి) రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిర్మాణంలో భాగంగా పక్కనేఉన్న కొచ్చగుట్టపల్లి గ్రామంలో 104 కుటుంబాలను నిర్వసితులుగా గుర్తించి ప్యాకెజీ, అర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టామని దీనికి తోడు 50 మీటర్ల దూరంలో చెలకపల్లి గ్రామం ఉందన్నారు. ప్రస్తుతం అదనపు టిఎంసి పంప్ హౌస్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ డంప్ యార్డు, గ్రామం మూడు వైపుల అన్నపూర్ణ రిజర్వా యర్ నీళ్ల ఉండడంతో ఇండ్లకు నీళ్లు చేరడం డ్రైనేజీ ఇండ్లకు రావడం చుట్టూ పక్కల డంప్ చేయడం సరైన సెల్ సిగ్నల్స్ లేకపోవడం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని లేఖ ద్వారా తమ దృష్టికి తేవడం జరుగుతుందన్నారు. గతంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ అర్అండ్ఆర్ కమిషనర్‌కు ఈ విషయంపై లేఖ రాసారని గుర్తు చేశారు. చెలకపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీ,అర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టాలని మంత్రిని లేఖలో కోరారు. గ్రామస్తులు గత 17 రోజులు నిరసనలు చేస్తు న్నారని వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు. చెలకపల్లి గ్రామస్తులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఈ మేరకు ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలను వివరించినట్లు తెలిపారు.

## పాఠశాలకు తాళం వేసిన గ్రామస్థులు

### -ముగ్గురు టీచర్లతో ఏడు తరగతుల విద్యాబోధన ఎట్లా ?

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):**



ఎంఈఓ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దౌలాపూర్ గ్రామస్తులు

ఏడు తరగతులకు గానూ ముగ్గురు టీచర్లు ఉండడంతో విద్యార్థుల విద్యాబోధన సాగేదెట్లా అని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసిన సంఘటన గురువారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... దౌలాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 120 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయులు లేకపోవడంతో 40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళగా ప్రస్తుతం 80మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తుండగా 7 తరగతులకు గానూ ముగ్గురు టీచర్లు ఉండడంతో విద్యార్థులకు విద్యాబోధన కష్టతరమవుతుందని, తమ పిల్లల భవిష్యత్తు పాడవుతుందని గమనించిన తల్లిదండ్రులు, గ్రామ నాయకులు పాఠశాలకు తాళంవేసి నిరసన తెలిపారు. వెంటనే పాఠశాలకు సరిపడా ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని తాజా మాజీ సర్పంచ్ వంటేరు యాదిలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తదనంతరం జగదేవ్‌పూర్‌లోని ఎంఆర్‌సి భవనం వద్దకు వెళ్లి మండల విద్యాధికారి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ అధికారితో మాట్లాడి ప్రస్తుతం ఒక ఉపాధ్యాయున్ని డిప్యుటేషన్‌పై నియమిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరికొద్ది రోజుల్లో ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు బోయిని పుల్లయ్య, నర్సింలు, భాస్కర్, జయమ్మ, నర్సమ్మ, బంగారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు పాల్గొన్నారు.

## సింగూర్ డ్యాంలో పడి వృద్ధుడి మృతి

**పుల్‌కల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ మౌలానా(60) గురువారం సింగూర్ డ్యాంను చూసేందుకు వచ్చి డ్యాం కింది భాగంలో స్నానం ఆచరిస్తుండగా ప్రమాదావశాస్తు డ్యాంలోపడి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):** ఆర్థిక ఇబ్బందులతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దార నాగరాజు(38) తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేయగా పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొడుకులు పవన్‌కళ్యాణ్, రాజుతో పాటు భార్య రాజమణి, తల్లి పెంటవ్వ ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి విజ్ఞప్తి చేశారు.

## పాము కాటుతో పాడి గేదె మృతి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గురువన్నపేటలో పాముకాటుతో పాడి గేదె మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బ్రాహ్మాడ్లపల్లి కనకయ్య రోజూమాదిరిగానే వ్యవసాయ బావి వద్ద పాడి గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం పాల కోసం వ్యవసాయ బావి వద్దకు కనకయ్య వచ్చి చూసేసరికి పాడి గేదె మృతి చెందింది. దీంతో కనకయ్యకు రూ. లక్ష ఆస్థినష్టం జరిగింది. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాము కాటుతో మృతి చెందిన పాడి గేదె



బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఊరురా బిఆర్ఎస్ జెండా పండుగ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, నంగునూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి జై తెలంగాణ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో జెండా పండుగ నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూరుగుపల్లిలో జెండ పండుగ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు మారెడ్డిరవీందర్‌రెడ్డి, చందర్‌రావు, ఎర్ర యాదయ్య, సత్తయ్య, బాలమల్లు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** సిద్దిపేట ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు, నీటిపారుదల కాలువల పనులను ముందుకు సాగనివ్వకుండా నిధులు కేటాయించకుండా అడ్డుపడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని బిఆర్ఎస్ నాయకులు సాయిరాం, రాధాకృష్ణశర్మ, కూర మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని విఠలాపూర్, రంగాయిపల్లి గ్రామాలలో గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరై పనులు నడుస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు రద్దు చేసి పనులను నిలిపివేసిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అడ్డుకుటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇట్టబోయిన శ్రీనివాస్‌ముదిరాజ్, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కనకరాజు, కొండం రవీందర్‌రెడ్డి, కాముని ఉమేష్ చంద్ర,గుండెల్లి వేణు, మధుసూదన్‌రెడ్డి, వైకుంఠం పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్



రసీదు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** ప్రజలు సకాలంలో ఇంటి, నల్ల పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం ఇంటింటికి తిరిగి 2024-25వ సంవత్సరానికి సంబంధించిన పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మున్సిపాలిటీకి ఎలాంటి బాకీలు ఉండకుండా చూసుకోవాలని, పన్నుల వసూళ్లతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కనకరాజు, వార్డు ఆఫీసర్లు సాంబరాజు, భవాని, మమత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండల స్థాయిలో ఇటీవల జరిగిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ ట్యాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని మోడల్ స్కూల్(ఆదర్శ పాఠశాల) విద్యార్థులు ప్రతిభ చూపి మండల మొదటి రెండు స్థానాలు సాధించగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం ఎస్ఐ తోట మహేష్, ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మొదటి స్థానంలో నిలిచిన సాత్విక్‌తో పాటు ద్వితీయ స్థానంలో నిలిచిన హాసినిలకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృథంతో పాటు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జగదేవ్‌పూర్ యువకులు

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):**

ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జగదేవ్‌పూర్ మండలకేంద్రానికి చెందిన శివాజీ కబడ్డీ క్లబ్ నుండి కొంపల్లి బాలకృష్ణ, కంసాని శ్రీను, జూపల్లి శివానంద్‌లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జగదేవ్‌పూర్ మండలం నుండి ముగ్గురు యువకులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న జగదేవ్‌పూర్ యువకులు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



కలెక్టర్‌కు మెమోరాండం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# డంపింగ్ యార్డు వద్దంటే వద్దు..

- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
- పలువురు నాయకుల అరెస్టు
- డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అన్ని గ్రామాలు ఏకం
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో
- కలెక్టర్‌కు మెమోరాండం అందజేత

**గుమ్మడిదల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల నాయకులు నల్లవల్లి ప్యారా నగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని గురువారం అంబేద్కర్ విగ్రహానికి వినతి ప్రతిపత్రం అందించారు. అన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్తపల్లి, నల్లవల్లి, గుమ్మడిదలలో సెల్ టవర్లను పలువురు యువకులు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డ్ పనులను నిలిపివేసేవరకు పోరాటం ఆగదన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నాయకుడు ఆదర్శరెడ్డి, కొలను బాల్‌రెడ్డి, జిన్నారం వెంకటేష్‌గౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, బిఆర్ఎస్ గుమ్మడిదల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, చిమ్మల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, యావన్నగారి సంతోష్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నిరుడు ఐలేష్ మాట్లాడుతూ వ్యవసాయం పై ఆధారపడిన సుమారు ఐదు గ్రామాల ప్రజలు ఏం చేయాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో తమ ప్రాంతాన్ని కాపాడుకోవడం కోసం చెట్టుకొకరు గుట్టకొక్కరై పోలీస్ సిబ్బంది అరెస్టు చేసి ఒక్కరికి ఒక్కరు కలుసుకోకుండా సంగారెడ్డిజిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలింపడంపై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మద్దతు తెలుపుతూ బంద్‌ను పాటించారు. మండలంలోని మున్సిపాలిటీతోపాటు పరిశ్రమలు బంద్ పాటించారు. అన్ని గ్రామాల రైతు, వర్తక, విద్యార్థి సంఘాలు, నేతలు స్వచ్ఛందంగా మద్ధతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే జరగబోయే నష్టాన్ని భావితరాల మనుగడను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రాంతం కలుషితమై ప్రశాంతమైన వాతావరణం మార్పులు చెంది రణరంగంగా మారబోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రెడ్డిలతో కలిసి మండల నాయకులు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయొద్దంటూ మెమోరాండం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇకనైనా తక్షణమే డంపింగ్ యార్డ్ ఏర్పాటును మానుకొని ప్రజలను కాపాడాలని కోరారు.



వన్ టౌన్ సీఐ వాసుదేవరావును సన్మానిస్తున్న దృశ్యం

## సిఐ వాసుదేవరావుకు ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా పక్షన గురువారం జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ వాసుదేవరావును మర్యాదపూర్వంగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చెందిరెడ్డి నరేందర్‌రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సత్కారించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి సీజన్ వన్ క్రికెట్ ట్రోఫీ మూడో రౌండ్ మ్యాచ్‌లను ప్రారంభించాలని కోరినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం,నీలం నరేందర్, శ్రీనివాస్, మండల చంద్రం,రాజు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రెడ్డి జేఏసి నాయకులు

**గజ్వేల్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):** తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి జేఏసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసి నాయకులు జశ్వంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఊడెం కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న రెడ్డి కులం గురించి అసభ్య పదజాలంతో మాట్లాడడం సరైందికాదన్నారు. ఒక కులాన్ని విమర్శించే నైతిక హక్కు ఎవరికి లేదని, తీన్మార్ మల్లన్న రెడ్డిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రెడ్డి జేఏసి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసి నాయకులు వెంకట్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎల్‌పి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సిఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై చర్చించినట్లు ఎమ్మెల్యే వివరించారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ప్రధానమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

## ఢిల్లీ పీఠం మాదే...

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు

**రామాయంపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మూడవసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టి యావత్ దేశ ప్రజల మన్ననలు పొందినందుకు రామాయంపేట మెదక్ క్రాస్ రోడ్ వద్ద భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు మాట్లాడుతూ అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించి, ఉద్యోగ ఉపాధ్యావ వర్గాలకు 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరట లభించిందనీ, గతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వంద సంవత్సరాలు పాలించినా, పేద ప్రజలకు ఏమి చేయలేదని, సబ్బండ వర్గాలకు ఎలాంటి న్యాయం చేయలేదని వారు పేర్కొన్నారు. ఇలాంటి బడ్జెట్ ఏనాడు ప్రవేశపెట్టలేదని అన్నారు. ఈ యొక్క బడ్జెట్ ప్రతి చిన్న, సన్నకారు రైతులకు, మహిళలకు, వ్యాపార వర్గాలకు నరేంద్రమోడీని దేవుడు అని కొలుస్తున్నారని రాములు వివరించారు. రాబోయే రోజుల్లో దేశంలో మళ్లీ నరేంద్ర మోడీ పాలన ప్రభుత్వం రావాలని ప్రజలు రైతులు, మహిళలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో ఎంపిటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చే విధంగా ప్రజలు బిజెపికి ప్రజలు ఓటెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని మంచి మెజార్టీతో గెలిపిస్తారని తెలిపారు. నిన్న జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బిజెపి కార్యాలయంలో ఇటీవల పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన రాగి రాములును పార్టీ కార్యకర్తలు సన్మానించడం జరిగింది. అనంతరం బడ్జెట్‌పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోయిన శ్రీనివాస్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వెలుముల రమేష్, రామాయంపేట ఇంచార్జి వెలుముల సిద్ధ రాములు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు బడ్జెట్ కన్వీనర్ బక్కయ్యగారి యాదగిరి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్ కుమార్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మెంగర్తి సంగయ్య, పట్టణ మాజీ అధ్యక్షులు శంకర్‌గౌడ్, మండల బూత్ అధ్యక్షులు నాగరాజు, చిన్నోళ్ల శేఖర్, రవికాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల్ అభివృద్ధికి ఉత్తరాల ఉద్యమం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి చేయాలని కోరుతూ చేపట్టిన ఉత్తరాల ఉద్యమం కొనసాగుతున్నది. ఘట్‌కేసర్ తపాలా కార్యాలయంలో మంగళవారం మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, పూర్వవిద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు పోస్టు ద్వారా లేఖలు రాసి పంపిస్తున్నారు. కేశవపట్నం అంజనేయులు ఉత్తరాలపు స్పీడ్‌పోస్టు ద్వారా పంపగా మాజీ వార్డుసభ్యులు కొత్తకొండ వెంకటేశ్, పూర్వ విద్యార్థులు కంది ప్రేమ్‌కుమార్, శశిధరణ్, సార శ్రీనివాస్‌గౌడ్, గాజుల వీరేందర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చాడ వెంకటరెడ్డి

## మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**అక్కన్నపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీకి వెళ్లి మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.25 లక్షలతోపాటు గాయపడిన కూలీలకు రూ. 15 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని అందించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మృతుల కుటుంబాలను పార్టీ శ్రేణులతో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. బాధితులకు వెంటనే ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. బాధిత కుటుంబాలలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.అధికారుల పర్యవేక్షణ లోపంగా జరిగిన ఈ ప్రమాదానికి కారణమైన ప్రతీ అధికారిపై చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్,పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిపె మల్లేష్,నాయకులు జాగిరి సత్యనారాయణ,ఎడల వనేష్, కొమురయ్య, సుదర్శనచారి, పర్శరాములు తదితరులు ఉన్నారు.

## క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని బిఆర్ఎస్ ఫౌండేషన్ ఛైర్మన్ బి.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్టు క్రీడాకారులకు గురువారం రూ. 10 వేల విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. యువత చెడుదారులు పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం యువతకు క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్, మాజీ ఎంపిటిసి మెరుగు కృష్ణగౌడ్, బిఆర్ఎస్ నాయకులు బూరుగు స్వామి, కృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో విద్యార్థి దశ ముఖ్యమైనది : ఎస్ఐ




మాట్లాడుతున్న ఎస్ఐ అభిలాష్

**కోహెడ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** జీవితంలో విద్యార్థి దిశ చాలా ముఖ్యమైనదని కోహెడ ఎస్ఐ అభిలాష్ అన్నారు. గురువారం సముద్రాల గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అమ్మాయిలు ఆకతాయిల అల్లర్లు, పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. విద్యార్థు వారి తల్లితండ్రుల కష్టాలను మరిచిపోవద్దన్నారు. ప్రతీ విద్యార్థి వారికి ఉన్న హక్కులను చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను సరైనదారిలో నడిపించాల్సిన బాధ్యత తల్లితండ్రులతో పాటు అధ్యాపకులకే ఉంటుందని గుర్తు చేశారు. ఎవరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నిబంధనలు ఉల్లగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, షీటీమ్ బృంధం సదయ్య, ప్రశాంతి, కృష్ణ ఉన్నారు.

## ఖాజాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** మండల పరిధి ఖాజాపూర్ గ్రామంలో గురువారం ఆర్‌విఎమ్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో వంద మందికి పైగా బిపి,షుగర్ రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందించారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

### డిఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు చేయడానికి ప్రయత్నించాలని జిల్లా వైద్యాధికారి పల్వాన్ కుమార్ అన్నారు. జగదేవ్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను, రక్త నమూనాల సేకరణ, ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారన ప్రసవాలు జరుగుతున్నాయని, సిబ్బంది ఆపరేషన్ లేకుండా ప్రసవాలు జరిగేవిధంగా కృషి చేస్తున్నారని వారి పనితీరుకు కితాబిచ్చారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఫార్మాసిస్టు పోస్టు ఖాళీ ఉన్నందున దానిని త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు వారికి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సత్యప్రకాష్ సిబ్బందితో కలిసి పూల మొక్కను అందజేసి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, సురేష్, మంగ ఉన్నారు.



డిఎంహెచ్‌ఓకు పూల మొక్కను అందజేస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

# యూరోపియన్ టెక్నాలజీతో డంపింగ్ యార్డ్ నిర్మాణం

**ఎలాంటి కాలుష్యం ఉండదు..చట్ట ప్రకారమే నిర్మాణం..అపోహ పడొద్దు.. జిహెచ్‌ఎంసి అధికారులు రఘుప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి**

**గుమ్మడిదల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డంపింగ్ యార్డుతో ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదని, యూరోపియన్ టెక్నాలజీతో నిర్మాణం చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం గుమ్మడిదల మండలం నల్లవల్లి కమాన్‌వద్ద వారు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డంపింగ్ యార్డుతో ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదని, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం జరగదని, యూరోపియన్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తి కాలుష్యానికి వ్యతిరేకంగా ఈ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. డంపింగ్ యార్డుకు 2008, 2009లలో జవహర్‌నగర్, లగ్దారం, ప్యారానగర్ మూడు ప్రాంతాల్లో స్థలాన్ని గుర్తించామని, ప్యారానగర్‌కు సంబంధించిన 150 ఎకరాల భూమిని 2015లో రెవెన్యూ శాఖ నుంచి స్వాధీనం చేసుకున్నామని, డంపింగ్ యార్డు నిర్మాణానికి 2023 లో పూర్తి అనుమతులు వచ్చాయని వివరించారు.



మాట్లాడుతున్న జిహెచ్‌ఎంసి అధికారి రఘుప్రసాద్

యూరోపియన్ టెక్నాలజీతో డంపింగ్ యార్డును చట్టప్రకారమే నిర్మిస్తున్నామని, ప్రతి రోజు 130 వాహనాల్లో 2 వేల టన్నుల వేస్టేజ్ ప్యారానగర్‌కి వస్తుందని, పూర్తిగా యూరోపియన్ టెక్నాలజీ వాడడం మూలంగా హైదరాబాద్ నుంచి చెత్త టిప్పర్‌లలో కాకుండా ట్యాంకర్‌ల రూపేణ బయట కనబడకుండా, రోడ్డుపైనా ఎక్కడా చెత్తపడకుండా పూర్తి భద్రతతో తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరుచేసి వెంటనే బాయిలర్‌లో వేసి ఎప్పటికప్పుడు శుద్ధీకరించి వేస్టేజీ ద్వారా వచ్చే వివిధ రకాలను పూర్తిగా ప్రజలు వాడుకోవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో ఒక సైడ్ వ్యవసాయానికి ఎరువుగా, మరోవైపు గ్యాస్ రూపంగా వస్తుందని, దీనిని మోటార్ వాహనాలకు నిర్భయంగా వాడుకోవచ్చని, అలాగే చివరగా మిగిలిన వ్యర్థం ద్వారా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కరెంటు ఉత్పత్తి చేసి వాడుకోవచ్చని తెలిపారు. ప్రజలు జవహర్‌నగర్‌లో రోజుకు 7 వేల టన్నుల వ్యర్థాలు శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయకముందే గుట్టలుగా వచ్చి పడిన వ్యర్థాల ద్వారా అక్కడ కలుషితమైన విషయం తెలిసిందే అని, అప్పటికి టెక్నాలజీ పెంచే విధానం లేక విఫలమయ్యామని, దానిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ రోజుకు 2 వేల టన్నుల సామర్థ్యం గల వ్యర్థాల ద్వారా ఏ రోజుకు ఆరోజు శుద్ధి చేసి నిల్వ ఉంచకుండా చూసే విధంగా ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అపోహాలు చెందకుండా పూర్తిగా మద్దతు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవ్ కుమార్, మండల తాహసీల్దార్ గంగాభవాని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

### -మాజీ ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త):**

పేద కుటుంబాలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన మీసాల రూప ప్రైవేట్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఆమెకు రూ.13వేల చెక్కు మంజూరు కాగా అట్టి చెక్కును ఆమె భర్త నర్సింలుకు తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్ అందజేశారు.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT SANGAREDDY

BY THE ORDER OF COURT

## మల్లన్న జాతరకు సర్వం సిద్ధం



జాతరకు సిద్ధమైన మల్లన్న ఆలయం

**జిన్నారం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
జిన్నారంమండలం బొల్లారం మున్సిపాలిటీలోని మల్లన్నబస్తి మల్లన్న స్వామి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధంచేసినట్లు రాష్ట్రకాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి గురువారం తెలిపారు. ప్రతి ఏటా స్వామివారి జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కాగా శుక్రవారం మైలపోలు కార్యక్రమం, శనివారం గంగపటం, ఆదివారం మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం అన్నదానం, సోమవారం నాగవెల్లి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన



అల్లాదుర్గంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలని ఎఎస్ఐ దేవిదాస్ సూచించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు గురువారం అల్లాదుర్గంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ దేవదాస్ మాట్లాడుతూ సైబర్ నేరాలు దినదినానికి పెరుగుతూ పోతున్నాయని, మొబైల్ ఫోన్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, అత్యవసరమై ఫోన్‌ను వినియోగించినా గుర్తుతెలియని నంబర్లనుంచి వచ్చే ఫోన్‌లను రిసీవ్ చేసుకోరాదని, లింక్‌లపై క్లిక్ చేయరాదని, యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోకూడదన్నారు. తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదన్నారు. బాల్య వివాహాలు చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి6, ప్రభాతవార్త**
వరంగల్ కోర్టులో న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ గురువారం హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు తరచుగా దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయవాదులపై దాడులు చేస్తున్న పోలీసులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## రోడ్లపై వాహనాలు నిలపరాదు బార్డర్ దాటితే చర్యలు తీసుకుంటాం



ప్రధాన రహదారి బార్డర్ లైన్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

**హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
పట్టణంలోని ప్రధాన రహదారులలో రోడ్లకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి ఏర్పాటుచేసుకున్న బోర్డులను, చిరువ్యాపారుల బండ్లను మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, ఎస్ఐ తోట మహేష్‌లు గురువారం తొలగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాల వద్ద సర్కిల్ లైన్లు ఏర్పాటుచేశారు. దుకాణాలకు వెళ్లే వినియోగదారులు సర్కిల్ లోపలే తమవాహనాలను నిలపాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టివిఎస్ షోరూంను ప్రారంభించిన మాజీమంత్రి



అర్జున్ టివిఎస్ షోరూంను ప్రారంభిస్తున్న మాజీమంత్రి హరీష్‌రావు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన అర్జున్ టివిఎస్ షోరూంను గురువారం మాజీమంత్రి, సిద్ధిపేట బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. షోరూంను టివిఎస్ మోటార్‌కంపెనీ జనరల్‌మేనేజర్ కెంద్రాజ్ జోషి, ఆటోమేటెడ్ వర్క్‌షాప్‌ను విశాల్‌విక్రమ్‌సింగ్, స్పేర్‌పార్ట్స్ సెంటర్‌ను వరుణ్‌గుప్తాలు ప్రారంభించారు. షోరూం ప్రారంభోత్సవానికి హాజరై ప్రారంభించిన మాజీ మంత్రి హరీష్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్రనాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

# కిష్టారెడ్డిపేట కాలనీల్లో ప్రతిరోజు త్రాగునీరు

-మంచినీటి రిజర్వాయర్‌ను పరిశీలించిన హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు డిఈ సుబ్బారాయుడు, డిజిఎం చంద్రశేఖర్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌లను గురువారం అమీన్‌పూర్‌మండల బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు కలిశారు. ఈసందర్భంగా పటేల్ గూడ త్రాగునీటి రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలోని దుర్గానగర్‌కాలనీలోని అపార్ట్‌మెంట్స్, మొహర్‌వలి, ద్వారకానగర్, బృందావన కాలనీలకు మంచినీటి కనెక్షన్ ఇచ్చినవాటికి మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటిని విడుదలచేసి పరిశీలించారు. ప్రతిరోజు ఈకాలనీలకు మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా అవుతుందని అధికారులు తెలియజేశారు. అతితొందరలో అమీన్‌పూర్ మండలంలోగల ప్రతికాలనీకి మిషన్ భగీరథ త్రాగునీరును అందిస్తామని తెలియజేశారు. ఈసందర్భంగా ఈర్ల రాజు మాట్లాడుతూ అమీన్‌పూర్ మండలంలో మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా చేయించే విషయంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు వాటర్‌బోర్డు ఉన్నతాధికారులతో పలుమార్లు మాట్లాడి అమీన్‌పూర్ మండలంలోని ప్రతి కాలనీ ప్రజలకు అతి తొందరలో మంచినీటిని అందించాలని వాటర్‌బోర్డు ఉన్నతాధికారులను కోరడం జరిగిందని తెలిపారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు వెంటనే స్పందించి ప్రతిరోజు త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టారని చెప్పుకొచ్చారు. మంచినీటిని సరఫరాచేసే సిబ్బందికి రాబోయేది ఎండాకాలం కాబట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటి సరఫరా చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, కిష్టారెడ్డిపేట్ బిజెపి బూత్ అధ్యక్షులు నాగేంద్రబాబు, బిజెపి నాయకులు, మంచినీటి సిబ్బంది పాల్గొన్నారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, మండల బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు

# డంప్‌యార్డు నిర్మాణాన్ని ఆపాలని డిఆర్‌ఓకు వినతి



డంప్‌యార్డు నిర్మాణాన్ని ఆపాలని జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందచేస్తున్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో సర్వే నంబర్ 40, 41లో 150 ఎకరాల్లో నిర్మిస్తున్న జిహెచ్‌ఎంసి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని డిమాండ్‌చేస్తూ గురువారం నర్సాపూర్, సంగారెడ్డి శాసనసభ్యులు వాకటి సునీతా లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్‌లతో కలిసి బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ పచ్చటి పంటపొలాల మధ్య, అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు పనులు నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. డంప్‌యార్డు నిర్మాణంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని, కాలుష్యంతో పంటల దిగుబడి తగ్గుతుందని, భూగర్భజలాలు కాలుష్యానికి గురవడంతో పశువులు తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నిర్మాణానికి కోర్టు స్టే విధించినా ప్రభుత్వం ఆదేమీ పట్టించుకోకుండా నిర్మాణం పనులు ప్రారంభించడం కోర్టును ధిక్కరించడం కాదా అని నిలదీశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు బిఆర్‌ఎస్ నాయకులు తొంట అంజయ్య, బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్‌ఎంసి కమీషనర్ ఎలంబర్తిని రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రామచంద్రాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు, ప్రధాన సమస్యల పరిష్కారానికి ఓ మారు డివిజన్‌ను పరిశీలించాలని వినతి చేస్తూ వినతి పత్రం అందచేశారు. డివిజన్‌న పర్యటించేందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ వివరించారు.

## డిసిసిబి బ్యాంక్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



డిసిసిబి బ్యాంక్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
పట్టణంలో నూతనంగా నిర్మించిన డిసిసిబి బ్యాంక్‌ను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం సందర్శించారు. బ్యాంక్‌కు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బ్యాంక్ మేనేజర్ శాలువాతో సత్కరించారు ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో మాజీముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి తన్నీరుహరీష్‌రావుల సహకారంతో నారాయణఖేడ్‌కు డిసిసిబి బ్యాంక్‌ను మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ వెంకటేశం, నాయకులు విజయ్, పవన్‌పాటిల్, సుధాకర్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

-కరస్‌గుత్తి ఆసుపత్రిలో బేటీ బచావో బేటీ పడావో



కరస్‌గుత్తి ఆసుపత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఫైనాన్షియల్ అధికారి నర్సింలు అన్నారు. గురువారం మండలపరిధిలోని కరస్‌గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ప్రారంభం అయి 10సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నర్సింలు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంగన్‌వాడి కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ జువేరియాబేగం, సూపర్‌వైజర్ విక్టోరియా, రాణి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలకు అన్యాయం జరిగితే సహించం

-ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
రిజర్వేషన్‌లో బిసిలకు అన్యాయంజరిగితే సహించేదిలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరోత్తం మాట్లాడుతూ 2014లో గతప్రభుత్వంచేపట్టిన సమగ్రకుటుంబసర్వేలో రాష్ట్రంలో 3కోట్ల 60లక్షల(51శాతం)మంది బిసిలున్నట్లు ధృవీకరించిందని, కాంగ్రెస్‌ప్రభుత్వం ఆనివేదికలను పక్కనపెట్టి 2024లో కులగణనచేసి 3కోట్ల54లక్షలప్రజలు సర్వేలో పాల్గొన్నారని, 16లక్షలమంది సర్వేలో పాల్గొనలేదని తెలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.నర్సింలు, బి.విఠల్, ధర్ముపవార్ ఉన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తా

-టిపిటిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ టిపిటిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్‌కు మద్దతు పలికితే విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమేలక్ష్యంగా సేవలుందిస్తారని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యం.సోమశేఖర్ అన్నారు. గురువారం మండలకేంద్రమైన కందిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమశేఖర్ మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎన్నికల్లో అశోక్ కుమార్‌కు మొదటిప్రాధాన్యత ఓటునువేసి మద్దతు పలకాలని వినతిచేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమానికి నిరంతరం పాటుపడతానన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు బాసటగా నిలిచి రాష్ట్రంలో కామన్‌స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయుటకు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. టిఎస్‌యుటిఎఫ్, ఎస్‌సిటియుఎస్, టిజిజెఎల్ఏ, బిటిఎఫ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ ఉపాధ్యాయ సంఘాలతోపాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయసంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను మొదటి ప్రాధాన్యత ఓటును విజయతీరానికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ కంది మండల అధ్యక్షులు సిద్దేశ్వర్, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు వసీం పాల్గొన్నారు.

## ఉర్సే షరీఫ్ పీర్‌గైబ్ జాతర

-వారం రోజుల్లో దర్గాను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
వారం రోజుల పాటు లక్షలాదిమంది భక్తులతో రాకతో దర్గా ప్రాంతం భక్తులతో సందడిగా మారనుంది. ఈనెల 7వ తారీఖు నుంచి 14వ తేదీ వరకు మండలకేంద్రమైన న్యాల్‌కల్ గ్రామశివారులోని కొండగట్టుపై కొలువున్న హజరత్‌పీర్ గైబ్ జాతర ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ బాధ్యులు తగు ఏర్పాట్లు చేశారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మంగళవారం 4రాష్ట్రాల మల్లయోధులు పాల్గొనే కుస్తీపోటీలు ప్రతిసంవత్సరం జాతరకు హైలెట్‌గా నిలుస్తూ ఉంటాయి. మల్లయోధులను ప్రోత్సాహించేందుకు శుక్వర్ధన్ రెడ్డి 30వేలు, సయ్యద్‌శకీల్ 20,051వేలు, మాజీజడ్పిటిసి సభ్యురాలు కొత్తపల్లి శారద భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డిలు 11తులాల చొప్పును వెండిని బహూకరించనుండగా మాజీ జడ్పిటిసి సభ్యురాలు బోడ స్వప్నభాస్కర్ 10తులాలను, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్, మెటల్‌కుంట మాజీసర్పంచ్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ యం.సిద్ధిలింగయ్యస్వామి, బిఆర్‌ఎస్ నాయకులు పడకంటి వెంకట్, గౌశ్యాబి అబ్దుల్ ఖాదర్ ఖురేశి, న్యాల్‌కల్ గ్రామానికిచెందిన పెద్దగొల్ల జగన్నాథ్‌లు 5తులాల చొప్పున వెండిని బహూకరించనున్నారు. ఆదివారం జరిగే పశువుల సంతకు చేరుకునే మేలైనపశువులను సాకుతున్న రైతులను ప్రోత్సహించేందుకు మండలకేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికిచెందిన కళాకారులు డాక్టర్ హోతి బస్వరాజ్ తనతల్లిదండ్రులు హోతి గిరిజబాయి, అడివప్ప, అన్నకుమారుడు హోతి నరేష్‌ల జ్ఞాపకార్థం బహుమతులను అందచేయనున్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయాగ్రామాల నుంచి దర్గాకు గంథం ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాకు సమర్పించనున్నారు. దర్గా ఆవరణలో ఖవాలీ కార్యక్రమాలు జోరుగా సాగనున్నాయి.

## పుస్తె, మెట్టెలు అందజేసిన బిజెపి నాయకులు

**కొల్చారం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**
పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి తనవంతు సహాయం అందజేస్తున్నారు. గురువారం కొల్చారం మండలపరిధిలోని సీతారాంతండాలో కరంతోట్ సునీతబాయి, లాల్‌సింగ్ దంపతుల కుమార్తె వివాహానికి తనవంతుగా పుస్తె, మెట్టెలను బహుకరించారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఘనపూర్ హరీష్, గిరజన మోర్చా అధ్యక్షులు పూల్‌సింగ్, సీతారాం తండా బూత్ అధ్యక్షులు అంజినాయక్, బిజెపి నాయకులు మంగలి లింగం, సంతోష్, శివలాల్, బిజెపి నాయకులు, తండావాసులు తదితరులు ఉన్నారు.

## బిజెపి నూతన అధ్యక్షులు మల్లేష్‌గౌడ్‌కు సన్మానం



బిజెపి నూతన అధ్యక్షులు మల్లేష్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**పెద్ద శంకరంపేట్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా వాల్దాస్ మల్లేష్ గౌడ్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించగా జిల్లా పార్టీ కార్యాలయంలో పెద్దశంకరంపేట బిజెపి మండలాధ్యక్షుడు కోణం విఠల్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు కోణంవిఠల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, తెలంగాణ బిజెపి రాష్ట్రనాయకత్వం పిలుపుమేరకు ప్రజా సమస్యలపై పోరాడటానికి మెదక్‌జిల్లా అధ్యక్షులు మల్లేష్‌గౌడ్ నాయకత్వంలో భారతీయ జనతాపార్టీని అన్నివర్గాల ప్రజలకు చేరువయ్యేలా పనిచేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల బిజెపి నాయకులు, ఓబిసి సెల్ అధ్యక్షులు బండల శ్రావణ్, కృష్ణ పాల్గొన్నారు.

## మాదిగలకు న్యాయం చేయని మంత్రి రాజీనామా చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న కాశపాగ ఇమ్మయ్య

-ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య

**పుల్‌కల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
మాదిగలకు న్యాయంచేయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి. దామోదర్ తనపదవికి రాజీనామా చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, కాకతీయ యూనివర్సిటీ జేఏసి నాయకులు ఎర్రోల్ల పోచయ్యలు డిమాండ్ చేశారు. గురువారం మండలపరిధిలోని తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇమ్మయ్య, ఎర్రోల్ల పోచయ్యలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపిన మంత్రి దామోదర్ రిజర్వేషన్ల అంశంపై గట్టిగా మాట్లాడలేదని ఆరోపించారు. మాదిగలపై మంత్రి దామోదర్ కపటప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. మాదిగలకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్ల కోటా అంశంపై మంత్రి పట్టుబట్టకపోవడంతోనే 3శాతం కేటాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 17 లక్షలు జనాభా ఉన్న మాలలకు 5శాతం రిజర్వేషన్లు ఇస్తే 32లక్షల జనాభా ఉన్న మాదిగలకు 12శాతం రిజర్వేషన్లుకేటాయించాల్సి ఉండగా 9శాతానికే పరిమితం చేయడం తగునా అని ప్రశ్నించారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని పలురకాల కమిషన్లు ఏర్పాటుచేసి సర్వే చేసిన అనంతరమే మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎబిసిడివర్గీకరణకు అనుకూలమనిచెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేశారని ఆరోపించారు. మంద కృష్ణమాదిగ లక్షడప్పులు వేలగొంతులు కార్యక్రమానికి పిలుపునివ్వడంతోనే ప్రభుత్వం దిగొచ్చి వర్గీకరణ చేపట్టిందన్నారు. గత జులైమాసంలో గంజోజిపేటలో ముగ్గురు మాదిగ యువకులు రోడ్డుప్రమాదంలో మృతిచెందినా మంత్రి దామోదర్ ఆయువకుల కుటుంబాలను పరామర్శించకపోవడం విడ్డూరమని దుయ్యబట్టారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధి ఖాజాపూర్ గ్రామానికిచెందిన తీగుళ్ళ నర్సవ్వ, సిద్దిరాములు కూతురు లతవివాహానికి మెదక్ జిల్లా బిఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని పంపించారు. గురువారం బిఆర్‌ఎస్ నాయకులు కుటుంబ సభ్యులకు అందించారు. కుంట నరేష్ క్వింటాల్ బియ్యం, నర్సింలు రూ.2వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

## కొత్తపల్లి విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

**పాపన్నపేట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కొత్తపలి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీరామచంద్ర సేవాసమితి మెదక్ ఆధ్వర్యంలో గురువారం దేవత్తు డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు రాజశేఖర్, బాగారెడ్డి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, నాగభూషణం, ప్రసాద్‌రెడ్డి, స్వర్ణ, సుహాసిని పాల్గొన్నారు.